జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 9-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 363 పేజీలు: 4 వెల : రూ.7




# పల్లెల్లో.. బెల్ట్‌ల జోరు!

*** పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు * మద్యం షాపుల నుంచే బెల్ట్ షాపులకు తరలుతున్న మద్యం * మత్తులో ఊగుతున్న గ్రామాలు * కన్నెత్తి చూడని ఎక్సైజ్, పోలీసు అధికారులు**

**సరుబుజ్జిలి/శ్రీకాకుళం క్రైం, జూన్ 8 (వార్త):** జిల్లాలో పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు వెలిశాయి. పల్లెల్లో బెల్ట్ షాపులు జోరందుకున్నాయి. అర్ధరాత్రి దాకా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ బెల్ట్ షాపులకు మద్యం షాపుల నుంచి మద్యం రవాణా అవుతోంది. మద్యం బాటిల్‌పై రూ.10 నుంచి రూ.50 వరకూ అదనంగా మద్యం షాపుల నిర్వాహకులు విక్రయిస్తున్నారు. మరికొంత అదనపు సొమ్ము వేసుకుని బెల్ట్ షాపుల నిర్వాహకులు అమ్మకాలు చేస్తున్నారు. చిన్నచిన్న బడ్డీల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నీరు లేని గ్రామాలు ఉండొచ్చు గాని, మద్యం లేని ఊరు లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.. మద్యం షాపుల నిర్వాహకులు సమయపాలన పాటిస్తుంటారు.. కాని బెల్ట్ షాపుల నిర్వాహకులు మాత్రం సమయపాలన ఉండదు. 24 గంటల పాటు బెల్ట్ షాపుల్లో మద్యం లభిస్తుంది. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొందరు పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతోందని గుసగుసలు ఉన్నాయి. వారికి నెలవారీ మామూళ్లు అందుతుండడంతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని కొందరు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే మద్యం షాపులన్నీ కొందరు అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని, ఆ షాపులను నిర్వహిస్తుంది నేతల అనుచరులవే కావడంతో దీంతో ఎక్సైజ్, పోలీసు అధికారులు, సిబ్బంది అటుగా కన్నెత్తిచూడడం లేదని పలువురు పేర్కొంటున్నారు.


## మద్యం షాపులా.. బార్లా!

ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు మద్యం షాపుల ఆవరణ బార్లను తలపిస్తోంది. రొట్టవలస, కొత్తరోడ్డు, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపుల వద్ద అనధికారిక బార్లు నడుస్తోంది. మద్యం షాపుల నిర్వాహకులు మద్యం షాపుల ఆవరణలో ఏకంగా చిన్న చిన్న షాపులు ఏర్పాటు చేసి మరీ మద్యం లూజు విక్రయాలు చేస్తున్నారు. మందుబాబులకు అవసరమైన చిరుతిళ్లను పంపిణీ చేస్తూ అదనపు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. మద్యం విక్రయాల వల్ల వచ్చే ఆదాయం కన్నా, పక్కనే ఏర్పాటు చేసిన షాపుల వల్ల అదనపు ఆదాయం వస్తుందని మందుబాబులు పేర్కొంటున్నారు.




# నిర్లక్ష్యంగా ఉంటే.. తప్పదు ముప్పు!

*** విస్తరిస్తున్న మహమ్మారి * ముందస్తు చర్యలు చేపట్టని జిల్లా యంత్రాంగం**



**శ్రీకాకుళం, జూన్8 (వార్త):** కోవిడ్ మహమ్మరి మళ్లీ చాప కింద నీరులా విస్తరిస్తోంది. దేశంలో ఇప్పటికే కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఏపీలోనూ విస్తరిస్తోంది. పక్కనే ఉన్న విశాఖ, విజయనగరం జిల్లాల్లో కేసులు నమోదు కావడంతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలంటూ సిబ్బందికి ఏపీ ప్రభుత్వం సూచనలు జారీ చేసింది. సమూహాలుగా ఏర్పడే కార్యక్రమాలు చేయొద్దంటోంది ఆరోగ్యశాఖ. జ్వరం, దగ్గు, గొంతునొప్పి లక్షణాలు ఉంటే.. వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలంది. రైల్వేస్టేషన్, బస్టాండ్, ఎయిర్‌పోర్టుల్లో.. సోషల్ డిస్టెన్స్, మాస్క్ తప్పనిసరి చేసింది. విదేశాల నుంచి వచ్చినవారు తప్పనిసరిగా కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలని పేర్కొంది. అధికారులకు ప్రత్యేక సూచనలు చేసిన హెల్త్ డైరెక్టర్.. మాస్కులు, పీపీఈ కిట్లు, అందుబాటులో ఉంచాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం మాత్రం ముందస్తు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్న విమర్శలు ఉన్నాయి. దీనివల్ల తగిన మూల్యం చెల్లించాల్సివస్తోందేమోనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. శ్రీకాకుళం జిల్లా వైద్యారోగ్యశాఖ కోవిడ్ పరీక్షా కిట్ల కోసం ప్రభుత్వానికి నివేదించి వారానికిపైగానే అయినప్పటికీ నేటికీ కిట్లు ఇంకా సరఫరా కాలేదని కొందరు రిమ్స్ వైద్యులు చెబుతున్నారు.

## కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి:డీఎంహెచ్‌వో

కరోనా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత ఆదివారం వెల్లడించారు. ఇటీవల దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులను అప్రమత్తం చేశామన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, ప్రజలు భయాందోళనకు గురికావద్దని, ప్రతి ఒక్కరు మాస్కులు ధరిస్తూ సమూహాలుగా ఉండరాదని పేర్కొన్నారు. చేతులు తరచుగా సబ్బుతోను, శానిటైజర్‌తోను కడుక్కోవాలని, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, రుమాలు అడ్డు పెట్టుకోవాలని సూచించారు. కోవిడ్ 19 వ్యాధి నిర్ధారణ పరీక్షలు శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్), జెమ్స్ ఆసుపత్రి రాగోలులో ఉచితంగా జరుగుతున్నాయన్నారు. జ్వరము, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి వాసన కోల్పోవడం, తలనొప్పి, జలుబు, నీళ్ళ విరోచనాలు తదితర లక్షణాలు గలవారు కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## వర్ల్ పూల్ నూతన షోరూమ్ ప్రారంభం

**ఇచ్ఛాపురం, జూన్ 8 (వార్త):** దాసన్న పేట సమీపంలో వర్ల్ ఫుల్ నూతన షోరూమ్‌ను ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మీ, ఆసి లీలా రాణి, సుభాష్ రౌలోతో పాటు షోరూం ప్రతినిధులు, సిబ్బంది, పాల్గొన్నారు.



# సిరిమానోత్సవం ప్రశాంతంగా నిర్వహించాలి

* అన్ని శాఖలు సమన్వయంతో ముందుకుసాగాలి
* సిరిమాను తిరిగే రూట్ ట్రాఫిక్ అంతరాయం ఉండకూడదు
* భక్తులకు అసౌకర్యం కలగనీయొద్దు
* ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు
* డ్రోన్,సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం క్రైం, జూన్8 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని పాత శ్రీకాకుళంలో ఈ నెల 10 తేదీన జరిగే పెద్దమ్మతల్లి, నుకాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవం ప్రశాంతంగా సజావుగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాగేలా, భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా పటిష్టమైన చర్యలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు. శ్రీకాకుళం నగరం, పాత శ్రీకాకుళంలో మంగళవారం పెద్దమ్మతల్లి, నుకాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవం అమ్మవార్ల పండగ జరగనున్న నేపథ్యంలో రూట్ మ్యాప్, బందోబస్త్, ట్రాఫిక్ మళ్లింపు, తదితర ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించారు. సిరిమాను వెళ్లే రహదారి మార్గాన ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్పీ సంబంధిత అధికారులకు సూచించారు. ఎండ తీవ్రతను దృష్ట్యా మున్సిపల్ శాఖ అధికారులు సమన్వయంతో రహదారికి ఇరువైపులా మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అమ్మవార్ల సిరిమాను తిరిగే ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడి లోపల, క్యూలైన్ల వద్ద, ముఖ్యకూడళ్ల వద్ద, సిరిమాను తిరిగే ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా పర్యవేక్షించాలన్నారు. సిరిమాను తిరిగే ప్రదేశాలలో డ్రోన్ కెమెరాలు ఉపయోగించి భక్తులు రద్దీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సిరిమాను తిరిగే ప్రదేశాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కమాండ్ కంట్రోల్ నుండి పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు సంబంధిత పోలీసు అధికారులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. పండగ సందర్భంగా జనసంచారం ఎక్కువగా వుంటుందని, సిరిమాను వీక్షించేందుకు జనాలు గుంపులుగా తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ రహదారి మార్గాలు సులువుగా తెలుసుకునేలా ఉండేలా సూచిక బోర్డులు, పోలీస్ వారిచే అనౌన్స్మెంట్ చేస్తూ తగు సూచనలు, హెచ్చరికలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు పైడిపు నాయుడు, నాగరాజు, ఇతర శాఖల అధికారులు, పోలీసు అధికారులు ఉన్నారు.



## నేర ప్రవృత్తి విడనాడండి

* రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

**శ్రీకాకుళం క్రైం, జూన్8 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐలు రౌడీషీటర్లకు, నేర చరిత్ర గలవారికి, పాత నేరస్తులకు, చెడునడవడిక కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించిలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. ప్రజా శాంతికి భంగం కలిగిస్తే రౌడీషీటర్లపై చట్టపరమైన మరింత కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎవరైనా సత్ప్రవర్తన మార్చుకోకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చేస్తామని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీసు శాఖ ఎల్లపుడూ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, నేర ప్రవృత్తి విడనాడాలి అని హితవు పలికారు.

## యోగ జీవితంలో ఒక భాగం కావాలి

* సహాయ సంచాలకులు కె.కవిత



**శ్రీకాకుళం, జూన్ 8(వార్త):** ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక యోగా కార్యక్రమం ఆదివారం ఖ్యాతి వృద్ధాశ్రమలో నిర్వహించారు. ఖ్యాతీ వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు రఘుపతి శ్రావణి ఆధ్వర్యంలో యోగాభ్యాసాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత మాట్లాడుతూ రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ, ఉపసంచాలకులు వై సత్యనారాయణ, లయన్స్ అధ్యక్షురాలు పైడి సిందూర, జేసీఐ పీడియాట్రిషన్ డా. వినోద్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిదులు నటుకుల మోహనరావు, రవికుమార్, ఆర్ట్స్ అఫ్ లివింగ్ ఆదినారాయణ, ఆదిలక్ష్మి, అనురాగ నిలయం ప్రతినిధులు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

# నేటి నుంచి జిల్లా స్థాయి యోగా పోటీలు

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం, జూన్ 8 (వార్త):** యోగా ప్రోత్సాహనికి కొనసాగింపుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన యోగాంధ్రా క్యాంపెయిన్ - 2025లో భాగంగా ఈనెల 9 నుంచి 14 వరకూ శ్రీకాకుళం జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ పోటీలు కలెక్టరేట్ సమీపంలోని డి ఆర్ డి ఏ కాంప్లెక్స్‌లోని వెలుగు భవన్ ప్రాంగణంలో ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి జరుగుతాయన్నారు. పోటీల్లో భాగంగా ఆసనాలు, సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగా పాటలు, చిత్రలేఖనం, స్కిట్, పోస్టర్ ప్రదర్శన, క్విజ్ తదితర అంశాలు ఉన్నాయి. పోటీల్లో గ్రామ స్థాయి విజేతలు మండలానికి, మండల స్థాయి విజేతలు జిల్లా స్థాయికి, అక్కడి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారు. వయస్సు ఆధారంగా జూనియర్ గ్రూప్ 10-18 సంవత్సరాలు, యువ గ్రూప్ 19-35 సంవత్సరాలు, సీనియర్ గ్రూప్ 35 ఏళ్లు పై వర్గాలుగా విభజించామన్నారు. ఈ పోటీల నిర్వహణ బాధ్యతను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు కే త్రినాధ స్వామి, ఉద్యాన శాఖాధికారి ఆర్వీవీవీ ప్రసాద్ పర్యవేక్షిస్తారన్నారు. డాక్టర్ అనిత (డీఎంహెచ్ఓ), డాక్టర్ కల్యాణ్ బాబు (డి సి హెచ్ ఎస్), డాక్టర్ జగదీష్ (ఆయుష్ అధికారి)లను యోగా పోటీల సమగ్ర పర్యవేక్షణ కోసం నియమించామని చెప్పారు. పోటీల సమయంలో ప్రతి రోజూ ఫలితాలను యోగాంధ్రా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. పాల్గొనేవారికి మంచినీరు, టిఫిన్, భోజన వసతులు, మొదలైన వాటిని కల్పించనున్నారు. యోగా పరవళ్లు విరజిమ్మేలా ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోందని కలెక్టర్ వెల్లడించారు.

### నేడు యోగా ర్యాలీ

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో యోగా ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అన్ని శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, పౌరులకు ఈ ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి ర్యాలీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ర్యాలీ శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) నుండి ప్రారంభమవుతుందని, అందులో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పౌరులు పాల్గొంటారని తెలిపారు. గ్రామ/వార్డు స్థాయిలో సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీ నిర్వహించాలని తహసీల్దార్లకు, ఎంపీడీఓలకు కలెక్టర్ ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్ శాఖను, ప్రథమ చికిత్స, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లతో వైద్య సిబ్బంది ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడానికి ఏపీ ఎస్ డి సి స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, సెట్‌శ్రీ మేనేజర్, ఆయుష్ శాఖ అధికారుల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. యోగా శిక్షకుల కోసం ఆయుష్ శాఖ సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, జూన్ 8(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

# అరసవల్లికి పోటెత్తిన భక్తులు

* కిటకిటలాడిన క్యూలైన్లు
* మండుటెండలో భక్తుల అపసోపాలు

**అరసవల్లి, జూన్ 8 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. జిల్లావాసులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. మండుటెండలో క్యూలైన్లలో ఇబ్బందులు పడ్డారు. సూర్యనారాయణ స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.4,15,200, పూజలు, విరాళాల రూపంలో రూ.91,388, ప్రసాదాల రూపంలో రూ.196,200 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ బి. నాగిరెడ్డి కృష్ణమూర్తి కుటుంబంతో సహా అరసవల్లి వచ్చి సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామి వారి ప్రసాదాలను, జ్ఞాపికను ఆలయాధికారులు అందజేశారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శ

**ఇచ్ఛాపురం, జూన్ 8 (వార్త):** బూర్జపాడు పంచాయితీ చిన్న లక్ష్మీపురంలో టీడీపి సీనియర్ నాయకుడు యర్రసారథి ఆరోగ్యం క్షీణించి ఇటీవల మృతి చెందారు. అలాగే కేసుపురంకి చెందిన నెయ్యిల సింహాద్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ కుటుంబాలను మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు, డి కామేశ్వరరావు, దున్న లోకేష్, ఇరోతు లక్ష్మయ్య, బుడత కృష్ణమూర్తి ఆదివారం పరామర్శించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పోలీసుల అదుపులో ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి

**భామిని/పాలకొండ, జూన్ 8 (వార్త):**సోషల్ మీడియా వేదికగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు పాలకొండ సీఐ చంద్రమౌళి తెలిపారు. భామిని మండలం సోలికిరి గ్రామానికి చెందిన జామి వెంకటేష్ వృత్తి రీత్యా కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయాల్లో ఇన్‌స్టాగ్రామ్ చూస్తుంటాడు. తన స్నేహితుడు పోస్ట్ చేసిన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వీడియోకు అమానుష రీతిలో కామెంట్ చేశారు. జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి వజ్రగడ రవి కుమార్ ఈనెల రెండవ తేదీన పాలకొండ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన సీఐ చంద్రమౌళి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం.. వెంకటేష్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఆధారంగా నిందితుడి అడ్రస్, కాల్ డేటాల ద్వారా సమాచారం తెలుసుకున్నారు. విశాఖపట్నం లోని పెందుర్తి ప్రాంతంలో వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని పాలకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## ఘనంగా జనసేన నేత భవాని జన్మదిన వేడుకలు

**మెళియాపుట్టి, జూన్ 8 (వార్త):** జనసేన పార్టీ పాతపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ కొరికాన భవాని జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాధాగోవిందస్వామి ఆలయంలో ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అనంతరం కేక్‌ను కోసం అందరికీ పంచిపెట్టారు. మారుమూల నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా ప్రత్యేక కోచింగ్ సెంటర్ తదితర ఎన్నో సేవా కార్యక్రమాలను పాతపట్నం నియోజకవర్గ పరిధిలో కొరికాన భవానీ చేపడుతున్నారని ఆ పార్టీకి చెందిన పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, ముకుందపురం పంచాయతీ సర్పంచ్ సవర భాస్కరరావు, లక్ష్మీపురం కిరణ్ కుమార్, మధుసూధనరావు, బూరగాన సత్యనారాయణ, రానా జనార్ధనరావు, మోహన్ రావు, పోలాకి ఆదినారాయణ, రానా చంద్రశేఖర్, భాస్కరరావు, యువకులు పాల్గొన్నారు.

## కరోనా పట్ల మరింత అప్రమత్తం



*** డాక్టర్ సాహితీ ప్రియదర్శిని**

**సరుబుజ్జిలి, జూన్ 8 (వార్త):** కరోనా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండా లని డాక్టర్ సాహితీ ప్రియదర్శిని సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు మాస్కులు ధరించాలన్నారు. చేతులు తరచుగా సబ్బుతోను, శానిటైజర్ తోను శుభ్రం చేసుకోవాలని, దగ్గినప్పుడు, తుమ్మి నప్పుడు, రుమాలు అడ్డుపెట్టుకోవాలని సూచించారు. జ్వరము, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి వాసన కోల్పోవడం, తలనొప్పి, జలుబు, నీళ్ళ విరోచనాలు తదితర లక్షణాలు ఉంటే కోవిడ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతీ ఒక్కరు కోవిడ్ - 19 నిబంధనలు పాటించాలన్నారు.

## 10న సరుబుజ్జిలి ప్రెస్ క్లబ్ ఎన్నికలు


**సరుబుజ్జిలి, జూన్ 8 (వార్త):**సరుబుజ్జిలి మండల ప్రెస్ క్లబ్ యూనియన్ ఎన్నికలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు మాజీ అధ్యక్షులు బెండి శ్యామలరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు నల్లి ధర్మారావు ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతాయన్నారు.

## హోదా పెంపుపై హర్షం

**ఆమదాలవలస, జూన్ 8 (వార్త):**శ్రీకాకుళం జిల్లా వైద్య విభాగం క్షేత్ర స్థాయిలో సీజనల్ వ్యాధులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హోదా కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర అధ్యక్షులు రమణ డాక్టర్ సుధాకర్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎస్.విజయలక్ష్మి, రాష్ట్ర వైస్ సెక్రటరీస్ దడి మంగమ్మ, ధనలక్ష్మి, జిల్లా కోశాధికారి పి.మోహిని రత్నం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

**హిరమండలం, జూన్ 8 (వార్త):** హిరమండలం మండలంలో గల కొండరాగోలు గ్రామానికి చెందిన సన్నీబోయిన చంద్రశేఖర్ ప్రమాదవశాత్తు మరణించడంతో కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని ఆ పార్టీ నాయకులు, గ్రామస్థులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆ కుటుంబీకులచే ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయించడమే గాకుండా మంజూరయ్యేలా ఎమ్మెల్యే కృషి చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విడుదలైన రూ.2లక్షలు విలువైన చెక్కును చంద్రశేఖర్ కుటుంబీకులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి, సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి సహాయ నిధులు అందిస్తున్నామన్నారు.



### విద్యార్థులను ప్రోత్సహిస్తే..


# మరింతగా రాణింపు

*** శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ * విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాల పంపిణీ**



**శ్రీకాకుళం, జూన్ 8 (వార్త):** ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు. శంకర్ అన్నారు. స్థానిక ఎన్జీవో హోమ్ లో శ్రీకాకుళం జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024-25 పదవతరగతిలో 550 పై బడి మార్కులు సాధించిన పద్మశాలి బాల, బాలికలకు ప్రతిభ పురస్కార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రతిభాపురస్కారాలను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడితేనే ఫలితం వస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానంలో నిలవాలని, తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకుసాగాలన్నారు. శ్రీకాకుళం జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, ట్రాఫిక్ సీఐ నాగరాజు, మాజీ కౌన్సెలర్ పాండ్రంగి శంకర్, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రతిభ అవార్డు గ్రహీత విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. ఆదివారం పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరగనున్న పారా స్పోర్ట్స్ చైతన్య యాత్రను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీలో పారా క్రీడాకారులకు అందిస్తున్న సువర్ణావకాశమని, ఇప్పటికే పింఛను నాలుగువేల రూపాయల నుండి, ఆరువేల రూపాయలకు కూటమి ప్రభుత్వం పెంచి అండగా నిలిచిందని గుర్తుచేశారు. క్రీడలలో వికలాంగులు అత్యంత ప్రతిభకనబరిచిన వారికి ప్రభుత్వ కొలువులో వెసులుబాటు కల్పిస్తుందన్నారు. కృషి, పట్టుదల, ఉంటే రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కమిటీ సభ్యులబృందం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పారా క్రీడాకారులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన గురుకులు

*** విద్యాశాఖ కార్యాలయం ముట్టడి**
*** డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు**
*** సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం**
*** ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక**



**శ్రీకాకుళం, జూన్ 8 (వార్త):**డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువులు రోడ్డెక్కారు. ఏకంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాడుతామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా చేపట్టాలన్నారు. వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా చేపట్టడాన్ని తప్పుపట్టారు. బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన మాట తప్పడం సరికాదన్నారు. సంఖ్యాపరంగా అత్యధికంగాఉన్న ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్‌తో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులను మానసిక ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, యుటీఎఫ్ నాయకులు రెడ్డి మోహనరావు, ఎస్.కిషోర్‌కుమార్ ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రమేష్, గోపాలరావు, భాస్కరరావు, ధనుంజయరావు, బాబూరావు, రమణ, వేంకటేశ్వర్లు, సోమేశ్వరరావు, వసంతరావు, చౌదరి రవీంద్ర వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546